# సైబరాబాద్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పరిధిలో 14 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్వాల్, మాదాపూర్, నార్సింగి ఠాణాల ఎస్‌హెచ్‌లు వి.ఆనంద్ కిశోర్, ఎన్.తిరుపతి, వి.శివకుమార్‌లను తమ వాస్తవ జోన్ మల్టీ జోన్-2కు సరెండర్ చేశారు. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త అధికారులను నియమించారు.

**బదిలీల వివరాలు..**

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| రాహుల్ దేవ్ | ఎస్ఓటీ, బాలానగర్ జోన్ | ఎస్‌హెచ్ఓ, అల్వాల్ పీఎస్ |
| కొక్కుండ బాలరాజ్ | సీసీఎస్, రాజేంద్రనగర్ జోన్ | ఎస్‌హెచ్ఓ, ఆర్జీఐ ఎయిర్‌పోర్టు పీఎస్ |
| వి.నర్సింహారావు | కేపీహెచ్‌బీ, ట్రాఫిక్ విభాగం | ఎస్‌హెచ్ఓ, కొత్తూర్ పీఎస్ |
| గుడి పవన్‌కుమార్‌రెడ్డి | ఏహెచ్‌టీయు అటాచ్డ్ టూ సైబర్‌క్రైమ్ | ఎస్‌హెచ్ఓ, మొయినాబాద్ పీఎస్ |
| జె.ఉపేందర్‌రావు | స్పెషల్ బ్రాంచ్ | ఎస్‌హెచ్ఓ, బాచుపల్లి పీఎస్ |
| జి.వెంకటయ్య | డీఐ, మాదాపూర్ | కేపీహెచ్‌బీ, ట్రాఫిక్ సెక్టార్ |
| బి.నాగిరెడ్డి | ట్రాఫిక్ అడ్మిన్, సైబరాబాద్ | డీఐ, బాలానగర్ |
| పి.శివప్రసాద్ | ఎస్ఓటీ, మాదాపూర్ | సీసీఆర్‌బీ, సీపీఓ, సైబరాబాద్ |
| ఆర్.శ్యాం సుందర్‌రెడ్డి | అటాచ్డ్ టూ కోర్టు మానిటరింగ్ వింగ్ | ఎస్ఓటీ, బాలానగర్ |
| ఎస్.నవీన్‌కుమార్ | డీఐ, బాలానగర్ అండ్ సనత్‌నగర్ | స్పెషల్ బ్రాంచ్ |
| కె.విజయ్ వర్ధన్ | సీపీఓ అటాచ్డ్ టూ ఎస్ఓటీ, మాదాపూర్ జోన్ | ఎస్ఓటీ, మాదాపూర్ |
| కుందురు వెంకట్‌రెడ్డి | కౌంటర్ నార్కొటిక్ ఆపరేషన్స్ టీమ్ | డీఐ, మేడ్చల్ |
| ఎన్.సుమన్‌కుమార్ | ఎస్‌హెచ్ఓ, బాచుపల్లి పీఎస్ | సీసీఎస్, రాజేంద్రనగర్ జోన్ |
| పి.ప్రసాద్ | డీఐ, మేడ్చల్ | సీటీసీ, సైబరాబాద్ |
| జి.విజయ్‌కుమార్ | సీపీఓ అటాచ్డ్ టూ ఎస్ఓటీ | సైబర్ క్రైమ్స్, పీఎస్ |
| కె. శంకర్‌రెడ్డి | ఎస్‌హెచ్ఓ, కొత్తూర్ పీఎస్ | కౌంటర్ నార్కొటిక్స్ ఆపరేషన్ టీమ్ |



బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
*- సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ)*



బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
*-సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ)*



## అంకితభావంతో పనిచేయండి

విధుల పట్ల సిబ్బంది పూర్తి నిబద్ధత, అంకితభావం కలిగి ఉండాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో డీసీపీలు నారాయణ్ నాయక్, శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శబరీష్, రవిచందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. *- సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ)*

# బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలపై ఆంక్షలు

## ఉత్తర్వులు జారీ చేసిన సైబరాబాద్ సీపీ

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ప్రజా భద్రతలో భాగంగా బహిరంగ ప్రాంతాల్లో సభలు, సమావేశాలతో పాటు మరణాయుధాలు, స్టోన్స్, రాళ్ల పేల్చే పేలుడు పదార్థాలు, దిష్టిబొమ్మల దహనం, ప్లకార్డుల ప్రదర్శనలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఫొటోల ప్రదర్శన, ఇతరులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, ఫొటోల ప్రదర్శనలకు అనుమతి లేదని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ప్రశాంతతకు భంగం కల్గకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే ర్యాలీలు, సభలు, వివిధ సంగీత కార్యక్రమాల్లో భాగంగా రోడ్లపై డ్రమ్స్, బ్యాండ్, హారన్లు మోగించడం వంటి వాటిపై కూడా నిషేధం విధించారు. ఈ కార్యక్రమాలను నిర్వహించాలనుకునే వారు ఆయా డివిజన్ల ఏసీపీలు, డీసీపీలు, కమిషనర్ల నుంచి ముందస్తు అనుమతులు తీసుకొని నిర్వహించుకోవచ్చని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని, తిరిగి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.

# నేడు, రేపు నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేజ్-1లోని సంతోష్‌నగర్ వద్దనున్న 1600 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం 6 గంటలకు వరకు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ 24 గంటల పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మిరాలం, కిషన్‌బాగ్, అల్జుబైల్‌కాలనీ, సంతోష్‌నగర్, వినయ్‌నగర్, సైదాబాద్, చంచల్‌గూడ, అస్మాన్‌గఢ్, యాకుత్‌పుర, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, రియాసత్‌నగర్, అలియాబాద్, బొగ్గులకుంట, అఫ్జల్‌గంజ్, నారాయణగూడ, అడిక్‌మెట్, శివంరోడ్, నల్లకుంట, చిలుకలగూడ, దిల్‌సుఖ్‌నగర్, బొంగులూరు, మన్నెగూడ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, వినియోగదారులు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు విజ్ఞప్తి చేశారు.

# రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు అత్యుత్తమ ప్రతిభ అవార్డు




బండ్లగూడ,జనవరి 2: రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు దేశంలోనే అత్యుత్తమ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు లభించింది. ఇటీవల కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లలో సర్వే నిర్వహించగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు దేశంలోనే మొదటి స్థానం దక్కింది. పలు కేసులను ఛేదించడంతో పాటు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించినట్లు గుర్తించారు. ఈ నెల 5న జయపూర్‌లో జరిగే సదస్సులో కేంద్ర హోంశాఖ అవార్డును ప్రదానం చేయనున్నట్లు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు పేర్కొన్నారు.

# కస్టమర్స్‌పై దాడి కేసులో పది మంది హోటల్ సిబ్బంది అరెస్ట్

అబిడ్స్, జనవరి 2: గ్రాండ్ హోటల్‌లో కస్టమర్స్‌పై దాడి చేసిన కేసులో పది మందిని అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు కథనం ప్రకారం... డిసెంబర్ 31న ధూల్‌పేట గంగాబౌలి ప్రాంతానికి చెందిన సుమిత్‌సింగ్ ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్‌కు వచ్చారు.. బిర్యానిని సరిగా ఉడకలేదని విషయంలో వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వెయిటర్లు కస్టమర్లపై దాడి చేసిన విషయంలో అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు అన్ని సీసీ పుటేజీలను పరిశీలించి వెయిటర్లు, ఫ్లోర్ క్లీనర్‌లు మొత్తం పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో హోటల్ యజమాని ప్రమేయంపై వివరాలను సేకరిస్తున్నామని, సాక్ష్యాలను సేకరించి అతడిని కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఇన్‌స్పెక్టర్ టి.నరసింహ రాజు తెలిపారు. కేసులో నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయడంతో.. పోలీస్ ఉన్నతాధికారులు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

## భార్యను వేధిస్తున్నాడని...

# యువకుడిపై భర్త రంపంతో దాడి

జవహర్‌నగర్, జనవరి 2: భార్యను వేధిస్తున్నాడని తట్టుకోలేకపోయిన భర్త యువకుడిపై రంపంతో దాడి చేశాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లోని ముత్యస్వామి కాలనీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓంకార్ విశ్వకర్మ, భార్య శ్వేత అదే ప్రాంతానికి చెందిన తులసీరాం విశ్వకర్మ ఇంట్లో అద్దెకు నివాసముంటున్నారు. స్థానికంగా కార్పెంటర్ పనులు చేసుకుంటూ ఓంకార్ జీవనం సాగిస్తున్నాడు. తులసీరాం కుమారుడు తనూ(22) దూరపు బంధువైన ఓంకార్ భార్య శ్వేతను వేధింపులకు గురిచేస్తున్నాడు. అప్పుడప్పుడు శ్వేత భర్తతో ఆమె గురించి అసభ్యకరంగా మాట్లాడేవాడు. దీంతో తనూపై ఓంకార్ మరింత కోపం పెంచుకున్నాడు. పనికోసమని రెండు రోజుల క్రితం తనూ కుటుంబసభ్యులు కల్వకుర్తికి వెళ్లారు. అదును చూసిన ఓంకార్,శ్వేత తనూను హత్య చేయాలనే ఉద్దేశంతో మంగళవారం రాత్రి చెక్కలను కోసే రంపంతో మెడ వెనుకభాగంలో బలంగా కొట్టారు. ఈ క్రమంలో తీవ్ర రక్త గాయాల మధ్య కొట్టుమిట్టాడుతుండగా.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని వెంటనే గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు తనూ తండ్రి తులసీరాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు ఓంకార్, శ్వేతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# బ్యాంకు ఉద్యోగి చేతివాటం

## ఫోన్ నంబరు మార్చి రూ.3.80లక్షలు స్వాహా

వెంగళరావునగర్, జనవరి 2: ఖాతా దారుడికి తెలియకుండా ఫోన్ నంబర్ మార్చి డబ్బులు కాజేసిన బ్యాంకు ఉద్యోగి పై ఎస్‌ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం..అమీర్‌పేట బీజేఆర్ నగర్‌కు చెందిన గొల్లపల్లి కృష్ణ (51) వృత్తి రీత్యా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. గత సంవత్సరం అక్టోబర్ 12న ఎస్‌బీఐ బల్కంపేట శాఖలో ఖాతా తెరిచేందుకు బ్యాంకుకు వచ్చాడు. ఆ సమయంలో బ్యాంకులోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తరుణ్ దొంతాల పరిచయమయ్యాడు. ఖాతా ప్రారంభించడం, నగదు డ్రా, నగదు జమ చేయడం వంటి విషయాలను గురించి గొల్లపల్లి కృష్ణకు అవగాహన కల్పించాడు. అనంతరం జనరల్ ఇన్సూరెన్స్ గురించి చెప్పాడు. ఇన్సూరెన్స్ స్కీం ద్వారా సంవత్సరానికి వెయ్యి రూపాయలు ఖాతా నుంచి కట్ అవుతాయని నమ్మించాడు. స్కీంలో చేరిన వెంటనే ఖాతా నుంచి రూ.6 వేలు, ఆ తరువాత రెండు రోజులకే మరో రూ.25 వేలు ఖాతా నుంచి కట్ అయ్యాయి. బాధితుడు కృష్ణ బ్యాంకుకు వెళ్లి తరుణ్‌ను ప్రశ్నించగా... మొత్తం రూ.30 వేల నగదు తిరిగి ఖాతాలో జమయ్యాయి. ఆ తరువాత బ్యాంకు ఖాతా నుంచి కృష్ణ ఫోన్ నంబర్‌ను తొలగించి తన మొబైల్ నంబరును జతపర్చాడు. తన పేటీఎం ద్వారా రూ.3.80 లక్షలను ఖాతా నుంచి కాజేశాడు. అనుమానం వచ్చిన బాధితుడు బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా ఖాతాకు లింకైన తన ఫోన్ నంబరు మారింది. అయితే అప్పటికే సదరు ఉద్యోగి మరికొందరిని మోసగించడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. బాధితుడు కృష్ణ ఎస్‌ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డిసెంబర్ 31న ఆనందంగా గడిపి..

వెంగళరావునగర్, జనవరి 2: అప్పటి దాకా న్యూ ఇయర్ వేడుకల్లో ఆనందంగా పాల్గొని..ఆ తర్వాత కొన్ని నిమిషాలకే ఉరివేసుకొని ఓ మహిళ తనువు చాలించింది. ఈ ఘటన ఎస్‌ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామ్‌ప్రసాదరావు కథనం ప్రకారం... ఎస్‌ఆర్ నగర్ సమీపంలోని బాపూనగర్‌కు చెందిన బిక్కీబాయి(70) కొంతకాలంగా గర్భాశయ క్యాన్సర్ సమస్యతో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో సంతోషంగా బిక్కీబాయి పాల్గొని.. అదే రోజు రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కారణంగా కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని, తన వైద్యానికి ఎక్కువ ఖర్చు అవుతుందని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. కుమారుడు పవన్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మూడేండ్లకే తీరిన ఆయుష్షు

## ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతి

మేడ్చల్, జనవరి 2 : మూడేండ్లకే చిన్నారి ఆయుష్షు తీరింది. మృత్యుపాశమైన ట్రాక్టర్... ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని కబళించింది. ఈ హృదయ విదారక ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామిక చెక్‌పోస్టు ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... బతుకుదెరువు కోసం మేడ్చల్ పారిశ్రామిక చెక్‌పోస్టు ప్రాంతానికి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుటుంబంతో సహా వలస వచ్చాడు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోడ్డు పక్కనే ఉన్న ఇంటి ముందు లక్ష్మణ్ కూతురు ఆద్య(3) సోమవారం ఉదయం ఆడుకుంటున్నది. ఆ సమయంలో అటుగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఆద్యను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ దనావత్ నాగేశ్ అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి, చిన్నారి ప్రాణాలు పోవడానికి కారణమైనట్టు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నవీన్ రెడ్డి తెలిపారు.



మృతి చెందిన ఆద్య(ఫైల్)